అడ్డాకులతో ఆర్థిక ఆసరా



విక్రయించడానికి తీసుకొచ్చిన అడ్డాకులు

జి.మాడుగుల: వేసవి కాలం వచ్చిందంటే ఆడవులకు వెళ్లి అడ్డాకులను సేకరించడమే ప్రధాన వ్యాపకంగా గిరిజనులు జీవనం సాగిస్తారు. అడవుల నుంచి సేకరిస్తున్న అడ్డపిక్కలు,అడ్డాకులు మంచి ఆదాయాన్ని తెచ్చిపెడుతున్నాయి. ప్రతి సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూడు నెలల పాటు అడ్డాకులు లభిస్తాయి. ఈ ప్రాంత గిరిజనులు ఉదయం, సాయంత్రం సమయాల్లో అడవుల నుంచి అడ్డాకులు, అడ్డపిక్కలు సేకరిస్తారు. అడవుల నుంచి సేకరించిన అడ్డాకులను ఎండలో ఆరబెట్టి కిమ్ములు(కట్టలు) కట్టి వారపు సంతలకు తరలించి, విక్రయిస్తారు. అడ్డాకులు 20 కిలోలు రూ.500-రూ. 800, కావడి రూ.1500-రూ.1800వరకు ధర పలుకుతోంది. జి.మాడుగుల మండల వ్యాప్తంగా సుమారు 100 టన్నుల అడ్డాకులను గిరిజనులు సేకరించి వారపు సంతల్లో వర్తకులకు విక్రయిస్తున్నారని ఒక అంచనా. వీటి సేకరణ ద్వారా 3 వేల మంది గిరిజనులు లబ్ధి పొందుతున్నారు. మండల వ్యాప్తంగా వీటి సేకరణ ద్వారా సుమారు రూ.20లక్షల వరకు ఆదాయం లభిస్తోంది. అడ్డాకులు, అడ్డపిక్కలు, అడ్డనార ద్వారా ఒక్కో కుటుంబం నెలకు రూ.10 వేల వరకు ఆదాయం పొందుతోంది. మూడు నెలలకు కలిపి కుటుంబానికి రూ.30వేల వరకూ ఆదాయం లభిస్తోంది. అడ్డాకులతో పాటు అడ్డనార, అడ్డకాయలు, అడ్డపిక్కలకు కూడా మంచి ధర లభిస్తోంది. పంట పొలాల్లో పనులు చేసే సమయాల్లో ఎండ, వర్షం నుంచి రక్షణపొందడానికి అడ్డాకులతో తయారు చేసే గిడుగు, తోక గిడుగులను వినియోగిస్తారు.



వాహనంలో మైదాన ప్రాంతానికి రవాణా చేసేందుకు సిద్ధం చేస్తున్న అడ్డాకులు



విక్రయించడానికి అడ్డాకుల కట్టను మోసుకొస్తున్న గిరిజన మహిళ

- గిరిజనులకు సిరులు కురిపిస్తున్న అడ్డాకుల సేకరణ
- సీజన్‌లో కుటుంబానికి రూ.30 వేల వరకు ఆదాయం
- అడవుల నుంచి 80-100టన్నుల సేకరణ
- జి.మాడుగుల మండలంలో 3 వేల మందికి లబ్ధి

బోరా చదవ, విస్తర్లు, అడ్డాకు చుట్ట, గిరిజన పండగల్లో వినియోగించే డొప్పలు, మిడుక, బియ్యం, విత్తనాలను భద్ర పరుచుకోవడానికి వినియోగించే దూబల తయారీలో వినియోగిస్తారు. అడ్డతాడు, అడ్డాకులతో వివిధ వస్తువులు తయారు చేసి, విక్రయించి గిరిజనులు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. కాల్చిన అడ్డపిక్కలను తినడంతో పాటు, కూరల తయారీలో వినియోగిస్తారు. వాటిని వారపు సంతల్లో విక్రయించి ఆర్థికంగా లబ్ధి పొందుతున్నారు.

అడ్డాకులకు పెరిగిన డిమాండ్

గ్రామాల్లో రానురాను ప్లాస్టిక్ వాడకం తగ్గుతుండడంతో అడ్డాకులకు డిమాండ్ పెరుగుతోంది. వారపుసంతల్లో కావడి ధర రూ. 2,000-2,200వరకు పలుకుతోంది. అడ్డాకులకు డిమాండ్ ఉండడంతో వాటి ధర ఇంకా పెరిగే అవకాశముంది.

మైదాన ప్రాంతాలకు భారీగా తరలింపు

గిరిజన ప్రాంతాల్లో కొనుగోలు చేసిన అడ్డాకులను లారీలు, వ్యాన్లు తదితర వాహనాల్లో కొత్తకోట, నర్సీపట్నం,విశాఖపట్నం, అనకాపల్లి, చోడవరం తదితర మైదాన ప్రాంతాలకు భారీగా తరలించి వ్యాపారులు విక్రయిస్తున్నారు. వివాహాది శుభకార్యాలలో వినియోగించే ప్లేట్లు, కప్పుల తయారీలో ఎక్కువగా వీటిని వినియోగిస్తున్నారు.

సంతల్లో విక్రయిస్తాం



ప్రస్తుతం అడ్డాకులు సీజన్ కావడంతో అడవుల్లో అడ్డాకులు, అడ్డపిక్కలు, అడ్డనార సేకరిస్తున్నాం. ఆరబెట్టి, కట్టలు కట్టి, వారపుసంతలకు తరలించి వ్యాపారులకు విక్రయించి, ఆదాయం పొందుతున్నాం.

–సుబ్బారావు, ఎస్.పెదబయలు గ్రామం

ఆదాయం బాగుంది



గ్రామ సమీపంలో గల కొండలు, అడవుల నుంచి అడ్డాకులను సేకరిస్తాం. భార్యాభర్తలం ఇద్దరం వారమంతా సేకరించిన ఆకులను ఎండలో ఆరబెట్టి, కట్టలు కట్టి వారపు సంతకు తరలించి విక్రయిస్తే రూ.రెండు వేల వరకు ఆదాయం వస్తోంది. ఆ సొమ్ముతో కుటుంబ అవసరాలను తీర్చుకుంటున్నాం.

–రాజుబాబు, గడుతూరు గ్రామం

రైల్ రోకోను విజయవంతం చేయాలి

హుకుంపేట: గిరిజన స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ 19వ తేదీన అరకులోయలో నిర్వహించనున్న రైల్‌రోకోను విజయవంతం చేయాలని డీఎస్సీ సాధన కమిటీ జిల్లా కో-కన్వీనర్ తాపుల కృష్ణారావు, మహిళ విభాగం కన్వీనర్ సొంటేన హైమవతి శనివారం కోరారు. ఇటీవల విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్ వల్ల ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని తెలిపారు. డీఎస్సీ నోటిఫికేషన్‌ను వ్యతిరేకిస్తూ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ ఆధ్వర్యంలో అరకులోయలో రైల్ రోకో నిర్వహించనున్నట్టు తెలిపారు. గిరిజన యువతీ యువకులు,నిరుద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

టైలరింగ్‌లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ముంచంగిపుట్టు: బీసీ కార్పొరేషన్ ద్వారా వెనకబడిన కులాల మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్టు ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి శనివారం తెలిపారు. 90రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు చెప్పారు. 18నుంచి 60 సంవత్సరాలు వయస్సు గల మహిళలు అర్హులని,75శాతం హాజరు ఉంటే ప్రభుత్వం సర్టిఫికెట్‌తో పాటు కుట్టు మిషన్‌ను షరతులతో ఇవ్వనున్నట్టు చెప్పారు.

ఆసక్తి గల మహిళలు బయోడేటా ఫామ్‌తో ఆధార్,రేషన్ కార్డు, కులధ్రువీకరణ పత్రం జిరాక్స్‌లను జత చేసి,రెండు పాస్ ఫొటోలు, సమాచారం అందించేందుకు సెల్ ఫోన్ నంబర్‌తో ఈ నెల 22వ తేదీలోగా మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆయన కోరారు.

క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సరోజిని

వీఆర్‌పురం: రేఖపల్లి సెంటర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని స్థానిక సర్పంచ్ పూనెం సరోజిని శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సోయం చినబాబు, మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, ఎంపీటీసీ పూనెం ప్రదీప్ కుమార్, పీసా కమిటీ సభ్యుడు సారా పాండు రాజు, కార్యదర్శి సూరి, పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్, ఈవోపీఆర్డీ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

స్పెషల్ డీఎస్సీ ప్రకటించే వరకు పోరాటం

రాజవొమ్మంగి : స్పెషల్ డీఎస్సీ ప్రకటించేవరకు పోరాటం కొనసాగుతుందని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు తెలిపారు. ఆయన శనివారం రాజవొమ్మంగిలో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు ఆదివాసీ గిరిజనసంఘం చేపట్టిన పలు ఉద్యమాల వల్లే ప్రభుత్వ అధికారులు నాలుగు సార్లు చర్చలకు ఆహ్వానించినట్టు చెప్పారు. ఈ సమస్యపై చర్చించేందుకు ఈనెల 18వ తేదీన స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ సమావేశానికి ఆదివాసీ సంఘం నాయకులు, డీఎస్సీ అభ్యర్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, పీసా కమిటీ సభ్యులు, కార్మిక సంఘాల నాయకులు హాజరుకావాలని ఆయన కోరారు.

విద్యుత్‌షాక్‌తో దుక్కిటెద్దు మృతి



మృతి చెందిన ఎద్దు

గూడెంకొత్తవీధి: మండలంలోని దేవరాపల్లి పంచాయతీ మంగళపాలెంలో ముప్పల భాస్కరరావుకు చెందిన దుక్కిటెద్దు జీయో టవర్ దగ్గర విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందింది. శనివారం మేత మేసేందుకు వెళ్లిన ఎద్దు విద్యుత్ షాక్‌కు గురై మరణించిందని, అధికారులు న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.

అగ్నిబాధిత కుటుంబానికి సాయం



అగ్ని బాధిత కుటుంబానికి వస్త్రాలు, పాత్రలు అందజేస్తున్న బీజేపీ నేతలు

వై.రామవరం: మండలంలోని యర్రంరెడ్డి పాలెం గ్రామంలో శుక్రవారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన ఆ గ్రామానికి చెందిన కారం బాబురావు, కారం లక్ష్మి దంపతులకు జిల్లా బీజేపీ నేత కారం సీతారమన్నదొర(ఢిల్లీబాబు) ఆధ్వర్యంలో శనివారం ఆపార్టీ మండల నేతలు బియ్యం, నిత్యావసరవస్తువులు, దుస్తులు, దుప్పట్లు,వంటపాత్రలు, నగదు అందజేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ కత్రం చిన్నారావు, మాజీ సర్పంచ్, పూసం అమ్మన్న దొర, పలువురు బీజేపీ నేతలు పాల్గొన్నారు.

కుట్టుశిక్షణ ప్రారంభం



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీవో

మోతుగూడెం: స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ మోతుగూడెం పంచాయతీలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వెనుకబడిన తరగతుల సహకార సంస్థ ద్వారా 25 కుట్టు మిషన్లు మంజూరు కావడంతో శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఎస్టీ కాలనీలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. కమ్యూనిటీ భవనాన్ని మంజూరు చేయాలని మహిళలు కోరడంతో స్థల పరిశీలన చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.ఈకార్యక్రమాల్లో ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు,సర్పంచ్ ఆకేటి సీత,కార్యదర్శి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి కుట్టు శిక్షణ

ఎటపాక: బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఈనెల 19 నుంచి కుట్టు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ప్రేమ్ సాగర్ శనివారం తెలిపారు.ఉపాధి కల్పనలో భాగంగా బీసీ,ఈడబ్ల్యూఎస్ మహిళలకు ఇచ్చే ఈశిక్షణకు మండలంలో 163 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో 90రోజుల పాటు రెండు బ్యాచ్‌లుగా శిక్షణ కొనసాగుతుందన్నారు.

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బహిష్కరణ



పెదబయలు ఎంపీడీవో కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు

- అధికారుల నిర్లక్ష్యంపై ఎంపీటీసీలు, సర్పంచ్‌ల ఆగ్రహం
- పెదబయలు ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన

పెదబయలు: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఎంపీటీసీలు, సర్పంచ్‌లు బహిష్కరించారు. అధికారులు పూర్తి స్థాయిలో హాజరుకాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ సమావేశాన్ని బహిష్కరించారు. పెదబయలు మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఉదయం 10.30 గంటలకు ప్రారంభించారు. ఎంపీపీ,ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సమయానికి హాజరయ్యారు. ఉదయం 11.30 గంటలైనా అటవీ శాఖ రేంజ్ అధికారి, మిగతా శాఖల మండల అధికారులు పూర్తిస్థాయిలో హాజరు కాకపోవడంతో సభ్యులు మండిపడ్డారు. ఎంపీపీ బొండా వరహాలమ్మ ఆధ్వర్యంలో సభ్యులు బయటకు వచ్చి పెద్ద ఎత్తున అధికారులు, ప్రభుత్వం తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.అనంతరం పలువురు మాట్లాడుతూ అటవీ శాఖకు సంబంధించి పలు సమస్యలు ఉన్నా పెదబయలు రేంజ్ అధికారి అధికారి హాజరు కావడం లేదని, ఇప్పటి వరకు ఒక్క సమావేశానికి కూడా హాజరు కాలేదని, ఆయనపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెదబయలు మండలం చిట్రాయిపుట్టు నుంచి బంగారుమెట్ట వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని,పెద్ద పెద్ద గోతులు ఏర్పడి వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారన్నారని తెలిపారు. అధికారులు పూర్తి స్థాయిలో హాజరుకాకపోవడం వల్ల గత జనరల్‌బాడీ సమావేశం కూడా వాయిదా పడిందని, ఇప్పటికీ అధికారుల్లో మార్పు లేదన్నారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు.మండల పరిషత్ సమావేశంలో చేసిన తీర్మానాలు అమలు కావడం లేదన్నారు. నిరసన కార్యక్రమంలో ఎంపీపీ బొండా వరహాలమ్మ, వైస్ ఎంపీపీ కొర్ర రాజుబాబు, ఎంపీటీసీలు బొంజుబాబు,వంతాల ఆనందరావు, పూర్ణారావు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా ప్రసాదరావు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన ప్రసాదరావు

కొయ్యూరు: స్థానిక ఎంపీడీవోగా జి.డి.వి. ప్రసాదరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. యలమంచిలి మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలనాధికారి(ఏవో)గా పనిచేస్తున్న ఆయనకు ఎంపీడీవోగా పదోన్నతి కల్పించి, ఇక్కడ నియమించారు. బాధ్యతలు స్వీకరించిన ప్రసాదరావుకు స్థానిక పరిపాలనాధికారి బాలమురళీ కృష్ణ, పంచాయతీ కార్యదర్శులు పుష్పగుచ్ఛాలు అందజేసి, అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో కార్యదర్శులు,సచివాలయ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని సూచించారు.

ఈదురు గాలులతో భారీ వర్షం



కొయ్యూరులో కురుస్తున్న వర్షం



వర్షపు నీటితో నిండిపోయిన వీధిరోడ్డు



కామయ్యపేట ప్రాంతంలో కురుస్తున్న వర్షం

కొయ్యూరు: మండలంలోని రాజేంద్రపాలెం, కొయ్యూరు, మంప,రేవల్లు తదతర గ్రామాల్లో శనివారం ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. రోడ్లు జలమయమయ్యాయి. రైతులు దుక్కులు దున్నేందుకు సిద్ధమవుతున్నారు.

హుకుంపేట: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఉరుములు,మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. శనివారం వారపు సంతకు వచ్చిన గిరిజనులు ఇబ్బంది పడ్డారు.

నిర్వాసితులు కోరిన చోటే పునరావాసం కల్పించాలి



తహసీల్దార్ సరస్వతికి వినతిపత్రం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

వీఆర్‌పురం: మెజార్టీ నిర్వాసితులు కోరిన చోటే పునరావాసం కల్పించాలని కోరుతూ స్థానిక ప్రజాప్రతినిధులు తహసీల్దార్ సరస్వతికి శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనేతర నిర్వాసితులకు తూర్పు గోదావరి జిల్లా గోకవరం, కోరుకొండ, రాజానగరం పరిసర ప్రాంతాల్లో పునరావాసం కల్పించాలని కోరారు. గ్రామసభలు నిర్వహించి, నిర్వాసితల నుంచి అభిప్రాయాలు సేకరించాలన్నారు. ప్రభుత్వ ఖర్చులతో నిర్వాసితులను పునరావాస ప్రాంతాలకు తీసుకు వెళ్లి స్థలాలను చూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్టీఐ అధ్యక్షుడు బొడ్డు సత్యనారాయణ, వైస్ ఎంపీపీ ముత్యాల భావాని, సర్పంచ్‌లు పిట్టా రామారావు, సోడె నరసమ్మ, వడ్డనపు శారద, ఉప సర్పంచ్ ముంజాపు రాము, ముత్యాల గౌతమ్, చిన్న రాజారావు, కాపరావు నాగు, కోటం జయరాజు, కోట్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన రిలే దీక్షలు



మూడవ రోజు రిలే దీక్షల్లో మాట్లాడుతున్న నేతలు

రంపచోడవరం: ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు కంగల శ్రీనివాసు డిమాండ్ చేశారు. మూడవ రోజు శనివారం కొనసాగిన రిలే నిరాహార దీక్షలో ఆయన మాట్లాడుతూ గిరిజన సలహా మండలిని వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. ఈ దీక్షలో పొడియం పండుదొర, మడకం ప్రసాద్‌దొర, సవలం శుభకృష్ణ, పవన్‌కుమార్, అబ్బాయిదొర, రామకృష్ణ, గిరిబాబు, లచ్చన్నదొర, కొండలు, దుర్గ, ఆనంద్, వెంకన్న పాల్గొన్నారు.

హక్కులు సాధించేవరకు ఉద్యమిస్తాం



చింతూరులో నిరాహార దీక్షలు పాల్గొన్న జేఏసీ నాయకులు

చింతూరు: ఆదివాసీ మేలుకో, హక్కులు కాపాడుకో అనే నినాదంతో తమ హక్కులు సాధించేవరకు ఉద్యమం కొనసాగిస్తామని ఆదివాసీ జేఏసీ డివిజన్ చైర్మన్ జల్లి నరేష్ తెలిపారు. ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక ఐటీడీఏ ఎదుట నిర్వహిస్తున్న నిరాహార దీక్షల్లో శనివారం ఆయన మాట్లాడుతూ ఆదివాసీ చట్టాలు, హక్కులు అమలు చేయకుండా ప్రభుత్వాలు తమను తీవ్రంగా మోసం చేస్తున్నాయన్నారు. జాతి మనుగడ కోసం ఉద్యమిస్తున్న ఆదివాసీ జేఏసీకి ప్రతిఒక్కరూ మద్దతుగా నిలవాలని కోరారు. హక్కుల సాధనకోసం యువతరం ముందుకు రావాలని ఆయన సూచించారు. జేఏసీ దీక్షకు మద్దతుగా చిడుమూరు సర్పంచ్ కాక అరుణ కుమారి దీక్షలో కూర్చున్నారు. జేఏసీ నాయకుల నిరాహార దీక్షల విషయం తెలుసుకుని అక్కడికి వచ్చిన ఐటీడీఏ పీవో అపూర్వభరత్ మాట్లాడుతూ విషయాన్ని గిరిజన సంక్షేమశాఖ అధికారుల దృష్టికి తీసుకెళతానని హామీనిచ్చారు. కాగా తమ డిమాండ్ల విషయంలో పూర్తిస్థాయి ఆదేశాలు వచ్చిన అనంతరమే తాము దీక్షను విరమిస్తామని తేల్చి చెప్పినట్లు జేఏసీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఇల్లా చిన్నారెడ్డి, ఆత్రం నవీన్, బీరబోయిన రామకృష్ణ, అక్కిపల్లి వీరయ్య, అభిరాం, లక్ష్మణ్, గంగూలీ, ప్రవీణ్ పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



పక్షుల కోసం నీటి పాత్రలను ఏర్పాటు చేస్తున్న ఫారెస్టు ఆఫీసర్లు



గంగవరంలో స్వచ్ఛాంధ్ర ర్యాలీలో పాల్గొన్న సర్పంచ్ అక్కమ్మ, ఎంపీడీవో లక్ష్మణరావు



చింతపల్లిలో ర్యాలీ పాల్గొన్న ఎంపీడీవో శ్రీనివాసరావు,ఏపీఎం శ్రీనివాసరావు



జీఎం కొత్తూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో డేవిడ్‌రాజ్,అధికారులు, సిబ్బంది



దుంబ్రిగుడలో మొక్కలు నాటుతున్న అటవీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు.

కూనవరం: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని, అందువల్ల ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కూనవరం సబ్ డివిజల్ ఫారెస్ట్ ఆఫీసర్ కె.వి.ఎస్.రాఘవరావు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎం.కరుణాకర్ అన్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో శనివారంనిర్వహించిన స్వచ్ఛాంధ్ర -స్వర్ణాంధ్ర కార్యక్రమంలో వారు మాట్లాడారు. అనంతరం పక్షుల కోసం నెట్‌లతో పాటు వాటి దాహార్తిని తీర్చుకునేందుకు నీటి తొట్టెలను ఏర్పాటు చేశారు. అనంతరం ర్యాలీ, టేకులబోరు సెంటర్‌లో మానవహారం నిర్వాహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో అనిల్ కుమార్ ఎఫ్ఎస్‌వోలు ప్రసన్న కుమార్, విజయలక్ష్మి, దేశయ్య, శంకరరెడ్డి, ఎఫ్‌బీవోలు జంపన్న, రాజు, కాంతరావు, నాగలక్ష్మి, సుబ్బయ్య శివుడు, చంద్రశేఖర్, జూనియర్‌అసిస్టెంట్‌దివ్య పాల్గొన్నారు.

గంగవరం: స్థానిక సర్పంచ్ కలుముల అక్కమ్మ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర -స్వర్ణాంధ్రపై గంగవరంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ర్యాలీ, మానవహారం, ప్రతిజ్ఞ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రత , ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైస్ ఎంపీపీ-2 కుంజం గంగాదేవి, ఎంపీడీవో వై.లక్ష్మణరావు, మండల వ్యవసాయాధికారి విశ్వనాథ్, ఉపాధి ఏపీవో ప్రకాష్, మాజీ ఎంపీపీ తీగల ప్రభ గ్రామంలో పర్యటించి ప్లాస్టిక్ నిషేధంపై షాపుల యజమానులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో పలుప్రాంతాల్లో మొక్కలు నాటారు. మాజీ కోఆప్షన్ సభ్యుడు చిన్నారావు, డిప్యూటీ ఎంపీడీవో నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా చింతపల్లిలో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం రామాలయం వద్ద చలివేంద్రాన్ని,పంచాయతీ కార్యాలయంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.పాత బస్టాండ్‌వద్ద మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు,వ్యవసాయశాఖ మండల అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలోని జీఎం కొత్తూరులో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్పంచ్ కిముడు రాంబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్ సీడీపీవో సువర్ణమ్మ, ఉపాధిహామీ పథకం ఏపీవో కొండబాబు, పంచాయతీ కార్యదర్శి రవి పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా దుంబ్రిగుడలో ప్రజాప్రతినిధులు, ప్రజలతో కలిసి అరకు అటవీ శాఖ రేంజ్ అధికారి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటారు. పోతంగి సర్పంచ్ వెంకటరావు, ఎంపీటీసీ గీతా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



చిలకలమామిడిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు,ఏపీవో రాజు

చింతపల్లి: మండలలో ఉపాధి హామీ పథకం పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. చిలకలమామిడి గ్రామంలో నిర్వహిస్తున్న ఫారం పాండ్ పనులను శనివారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మంచినీరు,మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీఎం రాజు తదితరులు పాల్గొన్నారు.